# రాంగ్ నెంబర్

—జియోలక్ష్మణ్



ఎంత చెప్పుకున్నా అనుకున్నట్లుగా అన్ని పనుల జరగవు. అది అందరికీ తెలిసిన విషయం. తెలిసినా అనుకుంటూనే వుంటాం. అదీ జీవితం.

ఉండటానికి ఓ చక్కని ఇల్లు, స్వంతగా ఓ లైబ్రరీ, విహరించడానికి ఓ చిన్న తోట ఉండాలని నాలాంటి భావుకుడు కోరుకోవడంలో తప్పులేదు. అయితే అది సాధ్యపడదు. మేము ఉంటున్నది ఓ నగరంలో. బ్రతుకుతున్నది మహా యాంత్రికంగా. ఏవో చిన్న చిన్న ఆనందాలు తప్ప పెద్ద కోర్కెలు తీరవు.

ఇల్లు మారిన తరువాత ఇల్లు చూసుకోవడం, దొరికిన ఇంట్లో సౌకర్యాలతో సర్దుకు పోవడం అలవాటయిపోయింది. అదే విధంగా మనుషులతో కూడా. మానవ సంబంధాలు చక్కగా నెలకొల్పుకోవడంలోనే ఉంది జీవన సౌందర్యమంతా.

మాకు ఇల్లు ఇచ్చిన వ్యక్తి ఒక మామ్మగారు. ఆమెలో మా చనిపోయిన అమ్మమ్మని చూసుకోవచ్చని నేను, వాళ్ళ నాన్నమ్మని చూసుకోవచ్చని మా ఆవిడ ఒక తీవ్రమైన భావావేశానికి లోనయ్యాం. ఇప్పటికీ అలాగే చూసుకుంటున్నాం.

అయితే కొంతకాలం గడిస్తే కాని మనస్తత్వాలు బోధపడవు కదా!

మేం అనుకున్నంత స్థాయిలో ఆమెలో మా అమ్మమ్మని చూడలేక పోయాం. ఆమె కూడా తన రక్త సంబంధీకులకు చూపించే ఆదరణ చూపించలేదు. అది సహజం. కొన్ని విషయాలు అనుకోవడం వరకే, ఆచరణలో చూపించలేం.

అయినా ఫరవాలేదు. మాకు, ఆమెకు మధ్య ఉన్న రిలేషను ఇంటి ఓనరుకి, ఇంట్లో అద్దెకున్నవాళ్ళకి ఉన్న సంబంధం మాత్రమే. అయితే ఇక్కడొక విషయం వుంది. అది చెప్పడానికే ఈ ఉపోద్ఘాతమంతా.

నేను ఆ రోజు లెటరు రాస్తున్నాను. మామ్మగారి నుంచి సమాచారం అందింది.

"డాడీ! మిమ్మల్ని మామ్మగారు పిలుస్తున్నారు" అని. మా పాప సాహితి చెప్పింది.

వెంటనే వెళ్ళలేక పోయాను.

ఎన్నాళ్ళకో ఒక ఉత్తరం వ్రాస్తున్నాను. అదీ ఒక రచయిత మిత్రుడుకి, ఏ ఇంటికో, బంధువుకో రాసే ఉత్తరం వేరు. క్షేమ సమాచార వాక్యాలు రెండు పైన, అందరిని అడగటాలు క్రిందనా రాస్తే సరిపోతుంది. కాని ఈ ఉత్తరం అలా కాదు.

నాలోని కవిని, రచయితని అతడి ముందు సాక్షాత్కరింప చెయ్యాలి. నా రాతలో క్లుప్తత, గాఢత, స్పష్టత ఉండాలి. అది అతడు మెచ్చుకోదగ్గట్టు ఉండాలి.

అందుకే వెంటనే వెళ్ళలేక పోయాను.

"ఫరవాలేదు మీ పని కానివ్వండి. తరువాత వెళ్ళొచ్చు" అంది మా ఆవిడ.

అలా అనడంలో ఆవిడ అభిప్రాయాలు ఆవిడకున్నాయి. నేను పెద్ద విషయాన్ని చిన్నగా చూస్తే, ఆవిడ చిన్న విషయాన్ని పెద్దగా చూస్తుంది. అంతే తేడా.

మామ్మగారి మీద ఇంట్లో ఒక్కొక్కరికి ఒక్కో అభిప్రాయం ఉంది.

"చెప్పిందే పదిసార్లు చెబుతుంది. నేనక్కడికి వెళ్ళను" అంటాడు మా పెద్దబ్బాయి.

"వెళ్ళారా? దొరికిపోతారు. అటు పైన మీ ఇష్టం" అంటుంది మా పాప.

"ఎవరు భరిస్తారండి ఆ పురాణం. చరిత్ర చెబుతుంది" అంటుంది మా ఆవిడ.

ఒక రకంగా అది నిజమేనేమో! నిప్పు లేకుండా పొగ పుట్టదు కదా!

నాక్కూడా అప్పుడప్పుడు అలానే అనిపిస్తుండేది. అయినా బయటపడే వాణ్ణి కాను. ఎంతయినా పెద్దావిడ. పెద్దవాళ్ళ అనుభవాన్ని గౌరవించాలి. పెద్దరికాన్ని అంగీకరించాలి. ఆ విషయంలో నాకు నిజాయితీతో కూడిన ఒక స్పష్టమైన అభిప్రాయం వుంది.



అందుకే నేను మామ్మగారిని భరిస్తాను.

ఉత్తరం పూర్తి చేసుకుని మామ్మగారి దగ్గరకు వెళ్ళేను. మామ్మగారు రెడీగా వుంది.

విషయాన్ని మూడు ముక్కల్లో చెప్పొచ్చు. కాని అలా చెబితే సంతృప్తి ఉండదేమో. ఎక్కడ్నుంచో మొదలెడుతుంది.

ఎందుకా బాధ "పిలిచారట దేనికండి?" నేనే అన్నాను. మామ్మగారి వదనం బాధకరంగా ఉంది. వెంటనే పలకలేదు. పెద్దతనం కదా. మాటలు పేర్చుకుంటూ ఉండవచ్చు అనుకున్నాను.

నెమ్మదిగా మంచం అంచుమీద కూర్చున్నాను.

"మీరెన్ని గంటలకి ఆఫీసుకి వెడతారు?" అదే ఆమె టెక్నిక్. ఆ ప్రశ్న వెయ్యడంలో నేను ఎన్ని గంటలకి ఆఫీసుకి వెడతానో, ఎప్పుడు వస్తానో ఆమెకు తెలియక కాదు. ఆ ప్రశ్న ప్రారంభం. చక్కటి ఎత్తుగడ, అద్భుతమైన శైలి, మంచి క్లైమాక్సు. బ్రహ్మాండమైన ముగింపు.

ఇదీ మామ్మగారి కథ.

"పది గంటలకు" చెప్పాను.

"వెళ్ళినప్పుడు ఓసారి కనపడండి"

"మళ్ళీ ఎందుకు? విషయం చెప్పండి"

"ఏం లేదు. కొంచెం టెలిఫోను బిల్లు కట్టేస్తారా?" అంది. అట్ట డొక్కులో కాగితాల మధ్య టెలిఫోన్ బిల్లు పైకి తీస్తూ.

"ఏం ఇంకా కట్టలేదా? టయిము అయిపోయినట్లుందే?" అన్నాను.

"అవును. అదే బాధ. టెలిఫోను పనిచెయ్యడం లేదు" బాధగా అందామె.

"సర్లెండి. నేను కట్టేస్తాను. ఇటివ్వండి" అన్నాను. బిల్లు, డబ్బు తీసుకున్నాను.

'మామ్మగారూ! నాకు తెలియక అడుగుతాను. మీకు టెలిఫోను ఎందుకండీ?' అని అడుగుదామనుకున్నాను. కాని గొంతులోకి వచ్చిన మాట నోటి బయటకు రాలేదు. ఆమె ఏమైనా అనుకుంటుందేమోనని అడగలేకపోయాను.

"ఈ ఫోను లేకపోవటం నాకు ఎంత ఇబ్బందిగా ఉందో తెలుసా" అందామె. కళ్ళలో నీళ్ళు తిప్పుకుంటూ ఫోనుకి ఆమె బాధకి ఏం సంబంధమో నాకు అర్థం కాలేదు. చాలా ఆసక్తికరంగా ఉంది.

టయిము అయితే అయింది.

"ఏం జరిగింది మామ్మగారూ!" అన్నాను. అంతే! ఆవిడ చెప్పిన మాటలు ఏవి దాదాపు వాది అదే పరిస్థితి.

"అయ్యయ్యో!" అన్నాను.

"ఒక్కగానొక్క కొడుకు. నలుగురు కూతుళ్ళు. వాళ్ళ పిల్లలు, వాళ్ళ పిల్లలు, నా అన్నదమ్ములు, వాళ్ళ పిల్లలు, వాళ్ళ పిల్లలు...ఇంత మంది వున్నారు. ఎవరికీ నా దగ్గరకి వచ్చే తీరిక లేదు. ఎప్పుడో వాళ్ళకి అవకాశం దొరికినప్పుడు వస్తారు. లేకపోతే రారు. వాళ్ళ కోసం ఎదురుచూస్తూ కూచోవటమే నా పని. కనీసం నా కొడుకయినా నన్ను చూడకపోతే ఎందుకు ఈ బ్రతుకు? వాడి బిజీ వాడిది. అందుకే ఈ ఫోను పెట్టించుకున్నాను. వాళ్ళు నన్ను పలకరించకపోయినా నేనే ఫోన్లు చేసి వాళ్ళని వెంటాడతాను. వెదికి పట్టుకుంటాను. రాంగ్ నెంబర్ అని పెట్టేసినా, లేరు అని అబద్ధమాడినా, ముక్తసరిగా మూడు ముక్కలు మాట్లాడినా, ఫోను దగ్గరికి వచ్చినా రాకపోయినా నా ప్రయత్నం నేను చేస్తూ వుంటాను. ఏదో ఒక గొంతు. నా రక్త సంబంధపు మాట వినపడక పోతుందా అని ఎదురు చూస్తాను. ఈ విధంగానే నా వాళ్ళతో సంబంధాన్ని నేను నిలబెడుతూ ఉంటాను. ఇప్పుడు నాకు ఫోను ముఖ్యమా కాదా మీరే చెప్పండి. ఈ నడుము ఈడ్చుకుంటూ, ఈ వయసులో ఒంటరిదాన్ని ఎవరి దగ్గరికి వెళ్ళగలను? అదే పని చెయ్యకపోతే ఎవరిని వెంటాడగలను?"

నాకు ఇందులో ఇంత ఉందా అనిపించింది మొదట. ఆ తరువాత ఆవిడ బాధకి కారణం ఏమిటో తెలిసి వచ్చింది. నా మనసంతా అదోలా అయిపోయింది.

ఇక అక్కడ ఉండలేక "వస్తానండి" అని వచ్చేసాను. ఆ రోజే టెలిఫోను బిల్లు కట్టేసాను.

* * *

వారం రోజులయ్యింది. ఫోను పలకలేదు. బామ్మగారు అడక్కముందే టెలిఫోను డిపార్టుమెంట్ వాళ్ళని అడిగాను.

"లేదండీ! డబ్బు కట్టిన వెంటనే కనెక్టు చేసేసాం" అన్నారు. మరి ఫోను ఎందుకు రాలేదు?"

"ఫోను రింగయిందా? మామ్మగారూ!" అడిగాను.

"ఒకటి రెండుసార్లు రింగయి ఆగిపోయింది. అదీ సంగతి. అప్పుడు అసలు సంగతి ఆరా తీసాను. కనుక్కుంటే కేబుల్ వైర్లు తెగిపోయాయట. మరో మూడు రోజుల వరకూ ఫోను మోగదని చెప్పారు. ఫాల్ట్ రిపేర్ సర్వీస్ వాళ్ళు.

ఈ విషయం బామ్మగారికి చెప్పలేదు.

"మూడు రోజుల్లో ఫోను వచ్చేస్తుంది. మీ ఫోను వచ్చే లోపల మా ఇంట్లో మీకు కావలసినన్ని ఫోన్లు చేసుకోండి" అని మాత్రం అనగలిగేను.

